# వాస్తవం డెయిలీ.కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

మంగళవారం 27.05.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి (కె.ఆర్)


## సిద్ధూ ఔట్.. ముఖ్యమంత్రి పదవికి రేపు రాజీనామా ?

పదవి నుంచి వైదొలగాలని కోరిన కాంగ్రెస్ హైకమాండ్!

రాజ్యసభ సీటు.. కొడుక్కు డిప్యూటీ సీఎం పదవి ఆఫర్!

డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం?



వివరాలు 8లో

## అదరహో ఆర్సీబీ..

వరుసగా రెండోసారి ఫైనల్లోకి

92 రన్స్ తేడాతో గుజరాత్‌పై ఘన విజయం

చెలరేగిన కెప్టెన్ పాటిదార్, బౌలర్లు



వివరాలు 8లో

ఐపీఎల్‌లో వరుసగా రెండోసారి కప్పు నెగ్గేందుకు ఆర్సీబీ అడుగు దూరంలో నిలిచింది.మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో 92 రన్స్ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. ఈహై స్కోరింగ్ పోరులో తొలుత ఆర్సీబీ 20 ఓవర్లలో 254/5 స్కోరు చేసింది. పాటిదార్‌కు తోడు విరాట్ కోహ్లీ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), కృనాల్ పాండ్యా (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) రాణించారు. అనంతరం జీటీ 19.3 ఓవర్లలో 162 రన్స్‌కే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. రాహుల్ తెవాటియా (68),జోస్ బట్లర్ (29) టాప్ స్కోరర్లు. జాకబ్ డఫీ మూడు, రసిఖ్ దార్, భువీ, కృనాల్ రెండేసి వికెట్లతోదెబ్బకొట్టారు. పాటిదార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లో ఓడిన గుజరాత్ ఫైనల్ చేరేందుకు మరో చాన్స్ ఉంది. బుధవారం సన్‌రైజర్స్-రాజస్థాన్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్‌లో నెగ్గే జట్టుతో శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో తలపడనుంది.

# జసీసిల రాకతో ఉద్యోగావకాశాలు

## హైదరాబాద్‌లో మరో కొత్త జిసిసి కేంద్రం

ముందుకొచ్చిన రీజెనరాన్

ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



వివరాలు 8లో





అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంటున్నాయిని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు.న్యూయార్క్ లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు.

# 5 రూపాయలకే చేపల కూరతో భోజనం

## పశ్చిమ బెంగాల్ సీఎం ఆదేశం 400 క్యాంటీన్లలో అమలు

తెలంగాణతోపాటు ఏపీలోనూ ఐదు రూపాయలకే భోజన పథకం అమలవుతున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం నిర్వహించే క్యాంటీన్లలో ఈ భోజన పథకం అమలవుతోంది. అయితే, ఇక్కడ శాకాహార భోజనమే అందిస్తారు. కానీ, అదే ఐదు రూపాయలకు పశ్చిమ బెంగాల్‌లో నాన్ వెజ్ భోజనం లభించనుంది. అదీ చేపల కూరతో. ఐదు రూపాయలకే చేపల కూర లేదా ఫ్రై తో కలిపి అన్నం అందిస్తారు.ఈ మేరకు బెంగాల్ సీఎం సువేందు అధికారి తాజాగా ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే ఈ పథకాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఆధ్వర్యంలో గత ఫిబ్రవరిలో 'మా' క్యాంటీన్లను ఏర్పాటు చేశారు. ఇందులో సబ్సిడీపై పేద ప్రజలకు రూ.5కే భోజనం అందిస్తున్నారు. అయితే, ఇకపై వీటిలో రూ.5లకే చేపల కూర లేదా ఫ్రై తో భోజనం ఇవ్వాలని సీఎం ఆదేశించారు. అన్నం, చేప కలిపి రూ.5కే అందిస్తారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఈ క్యాంటీన్లు నడుస్తాయి.రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 400 క్యాంటీన్లు ఉండగా, త్వరలో వీటి సంఖ్యను పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. బీజేపీ ప్రభుత్వం చేపల కూర అందించడానికి రాజకీయ కారణాలు కూడా ఉన్నాయి. బీజేపీ అధికారంలోకి వస్తే బెంగాల్‌లో ప్రజలు నాన్ వెజ్ తినలేరని, గుడ్డు, చేపలు కూడా మర్చిపోవాల్సిందే అని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టీఎంసీ ఆరోపించింది. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ.. నాన్ వెజ్‌ను నిషేధిస్తుందని తెలిపింది. ఈ ఆరోపణల్ని అప్పట్లోనే బీజేపీ ఖండించింది. పైగా రాష్ట్ర బీజేపీ నేతలు పలు చోట్ల చేపల కూరతో ఫెస్టివల్స్ నిర్వహించారు. చేపలు పట్టుకుని మరీ ప్రచారం చేశారు. తాము నాన్ వెజ్‌కు వ్యతిరేకం కాదని చెప్పారు.తాము సొంతంగా పాలిస్తున్న రాష్ట్రాలతోపాటు, కూటమి ప్రభుత్వాలు ఉన్న చోట కూడా మాంసాహారంపై ఎలాంటి నిషేధం లేదని బీజేపీ బదులిచ్చింది. బెంగాల్‌లో కూడా



ఎలాంటి నిషేధం విధించబోమని తెలిపింది. అందుకే ఇప్పుడు ఏకంగా రూ.5కే ఏకంగా నాన్ వెజ్‌తో భోజనాన్ని అందించాలని బీజేపీ ప్రభుత్వం నిర్ణయించింది.

## టాయిలెట్లు, శానిటరీ నాప్‌కిన్స్ లేవని బాలికలు స్కూల్ మానేయొద్దు

### సుప్రీం కోర్టు సూచన

**ఢిల్లీ:** దేశంలోని విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ లేని కారణంగా బాలికలు చదువు మానేయకుండా చూడాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచనలు చేసింది. జస్టిస్ బీ పర్ది వాలా, ఆర్ మహదేవన్ ఆధ్వర్యంలోని బెంచ్ తాజాగా ఈ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికీ దేశంలోని విద్యాసంస్థల్లో బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు లేవని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో గత జనవరి 30న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది.విద్యా సంస్థల్లో శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలని, బాలికల కోసం విడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్స్ అందించాలని సూచించింది. ఇవి సద్వినియోగం అయ్యేలా చూడాలని, దీనివల్ల దేశంలోని బాలికలు, మహిళలకు ఎంతో మేలు చేస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ సదుపాయాలు లేని కారణంగానే చాలా మంది ఆడపిల్లలు చదువు మానేసి, ఇంట్లో పనులకు అంకితమవుతున్నారని కోర్టు వ్యాఖ్యానించింది.ఈ తీర్పును ప్రభుత్వాలు అమలు చేయడం, దాని ఫలాలు అందరికీ అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత అని కోర్ట్ తెలిపింది.గతంలో ఆదేశించిన ప్రకారం ప్రభుత్వ విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ ఏర్పాటు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డాటా సేకరించారా అని కేంద్రాన్ని ప్రశ్నించింది.



దీనికి రెండు నెలల క్రితమే ప్రాథమిక డాటా సేకరించినట్లు కేంద్రం బదులిచ్చింది. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం నిరంతరం డాటా సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదిక తెప్పించుకోవాలని కోర్టు ఆదేశించింది.

## నేను ఏ రాజకీయ నాయకుడి పేరు తీయలేదు.. ఏ పార్టీ గురించి మాట్లాడలేదు

### జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ ఆవేదన

పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు నిరసనగా జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ధర్నా చేస్తుండగా.. పెట్రోల్, డీజిల్ రేట్ల గురించి తర్వాత ఆందోళన చేయొచ్చు కానీ.. ముందు వడ్లు కొనండి అని చెప్పినందుకు జగిత్యాల ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌ను విధుల నుండి తొలగిస్తూ జగిత్యాల ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రిమూవల్ లెటర్ జారీ చేశారని తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్ అశోక్ మీడియాతో మాట్లాడుతూ.. ఆవేదన వ్యక్తం చేశాడు. నేను బస్సు నడుపుకుంటూ వస్తున్న. వాళ్లు కాంగ్రెస్ (ఎమ్మెల్యేలు, మంత్రులు) ధర్నా చేస్తూ వస్తున్నరు. నేను అక్కడే సైడ్‌కు ఆగిన. అక్కడ మా ఊరు ఆయన ఉన్నడు. నేను చాలా సాదాసీదాగా మాట్లాడిన. డ్రైవింగ్‌లో ఉన్న కానీ బస్సును పక్కకు ఆపి మజ్జిగ ప్యాకెట్లు ఇస్తుంటే తీసుకున్నా. అక్కడున్నాయను ఏం చేస్తున్నరు అని అడిగితే పెట్రోల్, డీజిల్ ధరల గురించి మాట్లాడుతున్నమంటే.. దాని గురించి కాదు.. రైతులు పరేషాన్ అయితుర్రు ముందు వడ్లు, మక్కల గురించి మాట్లాడుర్రి అని చెప్పి వెళ్లిపోయిన గంతే. ఏ రాజకీయ నాయకుడి పేరు తీయలేదు. ఏ పార్టీ గురించి మాట్లాడలేదు. ఎవరి గురించి మాట్లాడలేదన్నాడు.పరిస్థితి గిట్లున్నది.. రైతులు ఆగమై తుర్రు. రోహిణి వస్తుంది.. వర్షం వస్తే ఆరు నెలల నుంచి కష్టపడ్డది అంతా వృధా అయితది అని చెప్పిన కానీ అంతకు మించి నేనేం అడగలేదు. ఈ విష



యంలో నా డ్యూటీ ఆపేసిర్రు. నీ డ్యూటీ తీసేసినం.. నువ్వు ఇక ఉద్యోగానికి రాకు అని డీఎం మాట్లాడుతున్నరు. ఆర్ఎం నుంచి నీకు లెటర్ వచ్చింది.. 5 డిపోలకు నీకు డ్యూటీ ఇయ్యకుండా లెటర్ పంపిండు.. అని చెప్పిండని ఆవేదన వ్యక్తం చేశారు.

# జాడలేని నైరుతి
# తప్పిన ఐఎండీ అంచనాలు

- దేశవ్యాప్తంగా రైతులు, జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్నది.
- మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది.
- అయితే ఆ అంచనాలు పూర్తిగా **తప్పాయి** కేరళను నైరుతి రుతుపవనాలు **తాకేందుకు** అనువైన పరిస్థితులు ఇంకా **ఏర్పడలేదు**
- దాంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా **ఆలస్యంగా** అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.



**ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది.**


**ఢిల్లీ:మే26:** దేశవ్యాప్తంగా రైతులు, జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్నది. మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. అయితే ఆ అంచనాలు పూర్తిగా తప్పాయి. కేరళను నైరుతి రుతుపవనాలు తాకేందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు. దాంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా ఆలస్యంగా.. అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించడానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు అవసరం. కేరళలోని 14 కేంద్రాలలో కనీసం 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. దాంతోపాటు గాలి వేగం, మేఘాల సాంద్రత వంటివి కూడా అనుకూలంగా ఉండాలి. అయితే మే 25 నాటికి ఈ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజ, ఎర్నాకుళం జిల్లాల్లో సాధారణంగా కురిసే తొలకరి జల్లులు పడుతున్నాయి.ఒకవైపు రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండగా.. మరోవైపు ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశంలో తీవ్రమైన వేడిగాలులు ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఢిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. రుతుపవనాలు కేరళను తాకిన తర్వాత కూడా ఉత్తర దిశగా వాటి కదలిక నెమ్మదిగా, తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల ఆలస్యం పెద్ద సమస్య కాకపోయినా, మొత్తం సీజన్‌లో వర్షపాతం ఎలా ఉంటుందనేది ఆందోళన కలిగిస్తోంది.

---

# పంట అవశేషాలను కాల్చొద్దు

**రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు.**

- తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదం
- భూసారం పూర్తిగా దెబ్బతింటుంది
- పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు
- యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం
- రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

**హైదరాబాద్:** రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు.రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు.రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**ఆత్మ కమిటీ ప్రమాణస్వీకారం**

**శ్రీ ఎల్లమ్మ సిద్ధోగంలో ఆది శ్రీనివాస్**



వాస్తవం : వేములవాడ

రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని రాజశ్రీ గార్డెన్స్‌లో వేములవాడ సిరిసిల్ల డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించగా ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. అనంతరం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.తదుపరి ఇటీవల వేములవాడ పట్టణానికి చెందిన ఆకుల నరేష్ ప్రమాదవశాత్తు కేదార్నాథ్ లో మరణించిన విప్ వారి భౌతికయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ..రైతులకు నూతన పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయం, నాణ్యమైన విత్తనం, పంటలలో సలహాలు సూచనలు ఇస్తు శాస్త్రవేత్తలు నిరంతరం రైతు క్షేమం కోసం పాటుపడాలని కోరారు.వేములవాడ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే రైతు విజ్ఞాన కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, భూసార పరీక్షలు, సాంకేతిక సలహాలు ఒకే చోట అందేలా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.రైతు విజ్ఞాన కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు ఒకటే కేంద్రం మంజూరు కాగా అది వేములవాడకు రావడం అదృష్టకరమన్నారు. ఎన్నో సంవత్సరాలుగా అభివృద్ధిలో వెనుకబడిన వేములవాడకు ఇప్పుడు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే తమ లక్ష్యమని చెప్పారు.గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని అన్నారు. ధార్మిక, కార్మిక, వ్యవసాయ రంగాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. నేతన్నల కోసం యార్న్ డిపోను తీసుకువచ్చామని, మహిళా సంఘాల బలోపేతం కోసం 8 వేల వీట బిల్డింగ్‌లను వర్చువల్ విధానంలో సీఎం ప్రారంభించారని వెల్లడించారు.పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నియోజకవర్గ పరిధిలో 13 ప్రాంతాల్లో 33/11 కెవి సబ్‌స్టేషన్ లకు మంజూరు తీసుకువచ్చామని పేర్కొన్నారు.నాకు రాజకీయాల కంటే అభివృద్ధే ముఖ్యం అని వారు స్పష్టం చేశారు... రైతుల సంక్షేమంపై నిజమైన హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. గతంతో పోలిస్తే ఈసారి వరి దిగుబడులు పెరిగాయని, ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు.తడిసిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. అలాగే రైతులు వరి కొయ్యాలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు రొండి రాజు, చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ లు కనికరపు రాకేష్, బొజ్జ మల్లేశం, డైరెక్టర్ లు,మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్ లు, కో -ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు పాల్గొన్నారు.

# మోత్కూరులో కేంద్రీయ.విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలి:ఎంపీ.కృష్ణయ్యకు వినతి



వాస్తవం : మోత్కూర్

మోత్కూరులో కేంద్రీయ విశ్వ విద్యాల యం ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని. డి మాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు మోత్కూరుకు వచ్చిన రాజ్యసభ సభ్యులు (ఎంపీ), బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు వినతి పత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మో త్కూరు లో కేంద్రీయ విశ్వ విద్యాలయం లేక ఈ ప్రాంత విద్యార్థులు ఉన్నత విద్యకు నోచుకోలేక పోతున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు. ఇక్కడ ఈ విశ్వ విద్యాలయం ఏర్పా టు చేసినట్లయితే మోత్కూరు తో పాటు గుండాల, ఆత్మకూ రు(ఎం), అడ్డగూడూరు, మోటకొండూరు, నార్కట్ పల్లి మండలాల విద్యార్థులకు, మంచి సౌకర్యం ఉంటుందని తెలియ జేయగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి, స్థానిక నాయకులు బయ్యని రాజు, చౌగాని సత్యం గౌడ్, అవిశెట్టి, అవిలిమల్లు,తండ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభం



వాస్తవం : వేములవాడ

వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్ , వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్దస్ జానయ్య, తదితరులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# కాటారంలో జోరుగా ఉపాధి హామీ పనులు



వాస్తవం : కాటారం

కాటారం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల్లో సుమారుగా 4158 మంది కూలీలు పాల్గొంటున్నట్లు ఏపీవో వెంకన్న తెలిపారు. ఉపాధి హామీ పనుల అమలులో భూపాలపల్లి జిల్లాలో కాటారం మండలం రెండో స్థానంలో నిలిచిందన్నారు.మండలంలోని గ్రామాల్లో చిన్న ఫీడర్ కాలువల పూడికతీత, చెరువుల పూడికతీత, నీటి కుంటల నిర్మాణం, చెట్ల పెంపకం, మట్టి పనులు విస్తృతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పనుల ద్వారా సాగునీటి సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.బయ్యారం విలాసాగర్ గ్రామంలో అత్యధికంగా రూ.307 వేతనం లభిస్తుండగా, కొత్తపల్లిలో కనిష్టంగా రూ.288 వేతనం అందుతున్నట్లు ఈసీ శ్రీకాంత్ తెలిపారు. ఉపాధి హామీ పనులు గ్రామీణ కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేసిన సర్పంచ్



వాస్తవం : రామగిరి

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పరిధిలోని అంగన్వాడి-2 సెంటర్ లో మంగళవారం పౌష్టికాహారమును సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పేరెంట్స్ వంటకాలు తయారు చేశారు.వారిని సర్పంచ్ అభినందించారు. ప్రభుత్వము అందిస్తున్న పౌష్టికాహారం చిన్నారులు,గర్భవతులు, బాలింతలు కచ్చితంగా తీసుకోవాలని ఆమె కోరారు.మంచి పౌష్టికాహారం తింటేనే ఆరోగ్యంగా ఉంటారని ఆమె అన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ తోగరుపాపమ్మ పాల్గొన్నారు.

# కన్నాపూర్, గద్దపాకలో మహిళా వారోత్సవాలు



వాస్తవం : శంకరపట్నం

శంకరపట్నం మండలం లోని కన్నాపూర్, గద్దపాక గ్రామాలలో మంగళవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మహిళా వారోత్సవాల్లో భాగంగా కన్నాపూర్ సర్పంచ్ నూనె రమ, గద్దపాక సర్పంచ్ కొయ్యడ పరుశురాములు అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, బాల్యవివాహాలు జరగకుండా తమంత కృషి చేస్తామని అన్నారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ బాల్య వివాహాలు జరగకుండా కృషి చేయాలని అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాత, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత మాత్రమే వివాహం చేయాలని అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నూనె అశోక్, గ్రామపంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

## జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



వాస్తవం : సిరిసిల్ల

మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు, వాటి వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులకు సూచించారు. జిల్లాలో డ్రగ్స్, మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నియంత్రణకు చేపడుతున్న చర్యలపై జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్యతో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన ఎన్డీపీఎస్ కేసులు, మాదక ద్రవ్యాల సాగు నివారణ చర్యలు, విద్యార్థులు, యువత డ్రగ్స్ వినియోగించకుండా నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. జిల్లాఅదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మాట్లాడుతూ..... మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులను గుర్తించి వారికి వైద్య సేవలు, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ కేంద్రం ద్వారా బాధితులకు చికిత్స, మానసిక పరమైన మార్గదర్శకత్వం అందిస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ... జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తూ, విద్యాసంస్థలు, పబ్లిక్ ప్రదేశాల్లో డ్రగ్స్ వల్ల కలిగే ప్రమాదాలపై పోలీస్, ఎక్సైజ్, విద్యాశాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసమావేశంలో ఎక్సైజ్ అధికారి శ్రీనివాసరావు, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శరత్, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి డ్రైవర్ అశోక్‌ని విధుల్లో నుండి సస్పెండ్ చెయ్యడం

# అప్రజాస్వామికం, చట్ట విరుద్ధం



వాస్తవం : చెన్నూర్ ఆర్సి

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రజా పాలన పేరుతో ప్రతీకార పాలన చేస్తున్నాడని మరోసారి రుజువయింది. రేవంత్ రెడ్డి మీకు చిత్త శుద్ధి ఉంటె రైతుల వద్ద మక్కలు కొనుగోలు కేంద్రాలలో మూలుగుతున్నాయి వాటిపైన శ్రద్ధ చూపండి కానీ ఈ రకంగా ప్రశ్నించిన వారి పైన అన్యాయం గా కేసులు, సస్పెండ్ లు చెయ్యడం అంటే పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించడమే...మీరు ప్రతీకారం తీర్చుకోవాల్సింది ప్రజల పైన,ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారి పైన కాదు – మీరిచ్చిన హామీలను అమలు చెయ్యడంలో విఫలం అయిన ఆలోచనల మీద మీరు ప్రతీకారం తీర్చుకోవాలని తెలియజేస్తున్న ..వెంటనే అశోక్ ని విధుల్లోకి తీసుకోవాలి, ఆయన సస్పెన్షన్ ను ఈ ప్రభుత్వం ఎత్తి వేయాలని లేకపోతే బి ఆర్ ఎస్ పార్టీ, కెసిఆర్ నాయకత్వంలో బాల్క సుమన్, నాయకత్వంలో మీ ప్రభుత్వం పై న్యాయ పోరాటం చేస్తామని తెలుపుతున్నాం.

# మూగజీవాలపై ప్రేమ చాటుతున్న కాటారం యువకుడు



వాస్తవం : కాటారం

మండుతున్న ఎండలు మనుషులతో పాటు మూగజీవాలు, పక్షులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో దాహంతో అలమటిస్తున్న పక్షులకు ఉపశమనం కలిగించేందుకు కాటారం మండల కేంద్రానికి చెందిన పంతకాని మల్లికార్జున్ వినూత్నంగా ముందుకొచ్చారు. ఇంటి ముందు ప్రహరీ గోడపై మట్టి పాత్రలు ఏర్పాటు చేసి వాటిలో ప్రతిరోజూ నీరు, గింజలు ఉంచుతూ పక్షులకు ఆహారం, తాగునీరు అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పలు రకాల పక్షులు అక్కడికి చేరుకుని దాహం తీర్చుకోవడంతో పాటు గింజలు తింటున్నాయి. ఎండల వేళలో పక్షుల పట్ల మల్లికార్జున్ చూపుతున్న ప్రేమాభిమానాలను స్థానికులు ప్రశంసిస్తున్నారు. ప్రకృతిని కాపాడాలంటే పక్షులు, మూగజీవాల సంరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన చెబుతున్నారు. ప్రతి ఇంటి ముందు చిన్న మట్టి పాత్రలో నీరు ఉంచితే పక్షులకు ఎంతో ఉపయోగం ఉంటుందని, ఇలా చిన్న సహాయం కూడా ఎన్నో ప్రాణాలను కాపాడగలదని ఆయన పేర్కొన్నారు. గతంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన గేదెను రోడ్డు పక్కకు చేర్చి ఉదయం, సాయంత్రం గడ్డి వేస్తూ నీరు అందించి పలువురి ప్రశంసలు పొందారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



వాస్తవం: వేములవాడ

వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో జిల్లా రిషత్ ఉన్నత పాఠశాల లో 2003–2004 సంవత్సరంలో 10 వ తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వాహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు 22 సంవత్సరాల తర్వాత ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నేమరువేసుకుంటు ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకొని గతంలో గడిపిన ఆనందకరమైన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి ఆటలు, పాటలు , నృత్యాలతో ఉల్లాసంగా గడిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినపుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, దయానంద్, వెంకటగిరి, రేగుల శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు కమలాకర్, చందనం శ్రీనివాస్, శ్రావన్, కార్తీక్, నజీమా, లావణ్య, స్వప్న, నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలు కాల్చితే కాలుష్యం

## కలయదున్నితే భూసారం

## మండల వ్యవసాయ అధికారి స్రవంతి



వాస్తవం : మనోహరాబాద్

వరి కోతలు ముగిసిన తర్వాత పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలను,గడ్డిని దహనం చేయడం వల్ల భూమికి,పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి స్రవంతి అన్నారు.మంగళవారం మండల కేంద్రమైన మనోహరాబాద్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ అధికారి స్రవంతి మాట్లాడుతూ అవగాహన లేమితో రైతులు చేస్తున్న ఈ చిన్న పొరపాటు భవిష్యత్తులో పెద్ద నష్టాలకు దారితీస్తుందని, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల మట్టిలో తేమ మొత్తం ఆవిరైపోతుందని తెలిపారు.భూమికి అవసరమైన సేంద్రియ కర్బనమ్,నత్రజని,భూస్వారం పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు మంటల్లో కాలిపోయి వృధాగా ఆవిరైపోతాయన్నారు.మంటల వేడికి భూమిపై పొరల్లో ఉండి పంటకు మేలు చేసే ఎన్నో సూక్ష్మజీవులు,వానపాములు మరణిస్తాయన్నారు.పొలాల్లో తిరిగి పాములు ముంగిసలు, ఉడుములు వంటి పర్యావరణానికి మేలు చేసే జీవరాసులు సైతం కాలి బూడిదవుతాయన్నారు.దీంతో నేల గట్టిపడి తదుపరి పంట వేయడానికి భూమిని దున్నడం కష్టమవుతుందన్నారు.మగిల్లను కాల్చడం వల్ల విపరీతమైన పొగ బూడిద గాలి లో కలిసిపోయి వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు.ఈ కాలుష్యం వల్ల చిన్న పిల్లలు,వృద్ధులకూ ఊపిరి తిత్తుల సమస్యలు,ఆస్తమా వంటి తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తాయని, అంతేకాకుండా పక్క పొలాల్లోని పంటలకు మంటలు వ్యాపించి పెను ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు.రైతులు వరి కొయ్యలను కాల్చకుండా వ్యవసాయ యంత్రాలతో వాటిని చిన్న ముక్కలుగా చేసి,పొలంలో నీరు పెట్టి ట్రాక్టర్,రోటావేటర్ లేదా కేజీ విల్ చక్రాలతో కలియ దున్నాలని,దీనికి ఎకరాకు 50 కేజీల సింగిల్ సూపర్పాసేట్ లేదా వేస్ట్ డీకంపోజర్ ను వాడితే రెండు మూడు రోజుల్లో వరి కోయలు కుళ్లిపోయి ఎకరానికి దాదాపు టన్ను వరకు అత్యంత విలువైన సేంద్రియ ఎరువులు తయారవుతాయి అన్నారు.దీనివల్ల తదుపరి పంట దిగుబడి ఐదు నుంచి పది శాతం వరకు పెరిగే అవకాశం ఉందన్నారు.కాబట్టి రైతులు వరి మాగిళ్లను కాల్చడం మానేసి భూమిలో కలయదున్ని భూసారాన్ని పెంచుకోవాలని సూచించారు..



# హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయాలి

### త్వరితగతిన వరిధాన్యం కొనుగోళ్ళు పూర్తయ్యేలా చూడాలి

### టెలి కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

హమాలీల సంఖ్యను పెంచి, వరి ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సరిపడా సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, సేకరించిన ధాన్యం మిల్లులు, గోదాంలకు తరలించి అన్ లోడింగ్ వేగవంతం చేసి నిల్వ చేయడం, ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ పురోగతి, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, పౌర సరఫరాలు, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, మెప్మా, రవాణా, తదితర శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్' మంగళవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ, మిల్లులో అన్ లోడింగ్ పై కలెక్టర్ ఆరా తీశారు. మిల్లుల వారీగా ఎంతవరకు ధాన్యం అన్ లోడింగ్ చేశారో వివరాలు అడిగి, హమాలీల సంఖ్య పెంచుకునేలా యజమానులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. లక్ష్యానికి మేరకు రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం క్రమంగా పెరిగేలా చూడాలని ఆదేశించారు. వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న బస్తాలను వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టార్పాలిన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. గన్నీ బ్యాగులు, కొనుగోలు కేంద్రాల్లో చేస్తున్న ట్యాబ్ ఎంట్రీ, తదితర వివరాలు ఆరా తీశారు. కొనుగోళ్ళు పూర్తయిన కేంద్రాల నుండి హమాలీలను అపరెల్ పార్క్ కు పంపించి, అన్ లోడింగ్ వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, వాహనాలను ఇతర కేంద్రాలను తరలించాలని సూచించారు. రోజూ వారీగా కొనుగోళ్ళ శాతం పెంచి, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు సరిపడా వాహనాలు సమకూర్చేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు.

# నత్తన నడకన సాగుతున్న ధాన్యం కొనుగోళ్లు

### రోహిణి కార్తె వచ్చిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాసులు

### కొనుగోలు పక్రియ వేగవంతం చేయాలి

### తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం



వాస్తవం : ఇల్లంతకుంట

ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యా న్ని రోజులు గడుస్తున్నప్పటికి కొనుగోలు చేయకపోవడం రైతును వంచించడమేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి దామెర సత్యం ప్రభుత్వం పై ధ్వజమెత్తారు . హామీలిచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. కేంద్రాలలో నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు పక్రియ నత్తనడక సాగుతున్నాయని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రాసులు కుప్పలు, తెప్పలుగా ఉన్నాయని, సరియైన టైం లారీలు రాక, కొనుగోలు పక్రియలో జాప్యం వల్ల రైతులు తీవ్ర ఆవేదనకు గురి అవు తున్నారని అన్నారు. ఒక వైపు రోహిణి కార్తె సమిపించిన కొ నుగోలు కేంద్రాలలో ధాన్యం తరలించక దిక్కుతోచని స్థితిలో రైతులు బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారని, ఒక వైపు ధాన్యం కొనుగోల్లు వేగంగా జరుగుతున్నాయని గప్పాలు కొట్టె నాయకులు, అధికారులు ఒక్కసారి కొనుగోలు కేంద్రాలకు వచ్చి చూస్తే రైతుల పరిస్థితి అర్థం అవుతుందని ఎద్దేవ చేసారు. అలాగే నెలల తరబడి కొనుగోలు కేంద్రాలలో మొక్క జొన్న, పొద్దుతిరుగుడు పంటలను కూడా కొనుగోలు చేయాలనీ, కొనుగోలు కేంద్రాలకు సకాలంలో లారీలు, గన్నీ సంచులు వచ్చేలా చూడాలని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, అధికారులు, స్థానిక ఎమ్మెల్యే రైతుల పరిస్థితి దృష్టిలో ఉంచుకుని కొనుగోలు పక్రియ వేగవంతం చేసి ధాన్యాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అన్నాడి నరేందర్, మండల అధ్యక్షుడు ఎల్లోజీ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల కై పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలి

### రాష్ట్ర డి జి పి సీవీ ఆనంద్ ను అభినందించిన పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు

### శాంతి కమిటీలు వేయాలని

### డిజిపి ని కోరిన డా.వర్రె వెంకటేశ్వర్లు




వాస్తవం : మోత్కూర్

తెలంగాణ రాష్ట్ర డిజిపిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను మంగళవారం హైదరాబాదులోని డిజిపి కార్యాలయంలో రాష్ట్ర పోలీస్ కంప్లైంట్ అథారిటీ సభ్యులు డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి అభినందించారు .తెలంగాణ రాష్ట్రంలో సిసి ఫుటేజ్ ల నిర్వహణ, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతి భద్రతలు అదుపులోకి రావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డా.వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే తెలంగాణ పోలీస్ వ్యవస్థ నెంబర్ వన్ గా నిలవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో సంఘవిద్రోహ శక్తుల నివారణకు అన్ని గ్రామాలు, పట్టణాల్లో నేరాల నియంత్రణ కోసం అన్ని వర్గాల ప్రజలతో శాంతి కమిటీలను ఏర్పాటు చేసి, ఆయా కమిటీల ద్వారా నేరాలపై ప్రజలకు ముందస్తుగా అవగాహన కల్పించాలని, నేరాలను అరికట్టే విధంగా పోలీస్ వ్యవస్థను తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వర్రే వెంకటేశ్వర్లు డిజిపి ఆనంద్ ని కోరారు.

## బీరప్ప పట్నాలకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కి ఆహ్వాన పత్రిక



వాస్తవం : ధర్మారం

పెద్దపల్లి జిల్లా ధర్మారంమండలం ఎర్రగుంటపల్లి గ్రామ శ్రీ మల్లికార్జున యాదవ్ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మారం మండలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం రోజు నమర్యాదపూర్వకంగా కలిసి బీరప్ప పట్నాలకు రావాలని ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ కొత్త నరసింహులు మార్కెట్ డైరెక్టర్ ఆవుల శ్రీనివాస్ గ్రామ సర్పంచ్ దూడ ప్రియాంక - తిరుపతి ఉప సర్పంచ్ కోల తిరుపతి యాదవ్ పెద్ద గొల్ల దండ వేణి రమేష్, పెదకుర్మా సాయిల చిన్న రాజమల్ల యాదవ్ సంగం ప్రెసిడెంట్ అల్లం శ్రీశైలం వైస్ ప్రెసిడెంట్ కొమ్ము మహేందర్ కోశాధికారి దండ వేణి రాము దండ వేణి కొమురయ్య సాయిల పోశయ్యదండ వేణివెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో ఈజీ ఓపీ రిజిస్ట్రేషన్



వాస్తవం : గోదావరిఖని

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల రద్దీ తగ్గించేందుకు కొత్త విధానం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల రద్దీ తగ్గించేందుకు ఈజీ ఓపీ రిజిస్ట్రేషన్ విధానాన్ని తీసుకొచ్చారు. క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి ఓపీ నంబర్ పొందే విధంగా ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో కౌంటర్ల వద్ద గంటల తరబడి నిలబడే ఇబ్బందులు తగ్గనున్నాయని చెబుతున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు ఇంటి నుంచే లేదా ఆసుపత్రి ప్రాంగణంలోనే తమ వివరాలను నమోదు చేసుకుని వెంటనే ఓపీ టోకెన్ పొందవచ్చు. దీంతో సమయం ఆదా కావడంతో పాటు ఆసుపత్రుల్లో రద్దీ కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని వైద్య సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

## పండుగల నేపథ్యంలో పీస్ మీటింగ్ నిర్వహణ



వాస్తవం : ఎన్టిపిసీ మేడిపల్లి సెంటర్

ప్రాంతంలో శాంతి భద్రతలు కాపాడడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం మరియు పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ వర్గాల నాయకులతో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో సామాజిక ఐక్యత, సమస్యల పరిష్కారం, పండుగల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యువత బాధ్యతలు వంటి అంశాలపై చర్చించారు. ప్రజలు చట్టాలను గౌరవిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని అధికారులు సూచించారు. అలాగే ఎలాంటి అపోహలు, వదంతులు నమ్మకుండా సమస్యలు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో పలువురు అధికారులు, సంఘ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వాస్తవం



# ఉద్యోగ పెన్షనర్స్‌కు నూతన పి ఆర్ సిని వెంటనే ప్రకటించాలి

## టాప్రా జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్



వాస్తవం : శంకరపట్నం

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హుజురాబాద్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణం లోని టాప్రా కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టాప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు  చందుపట్ల జనార్ధన్, గౌరవ అధ్యక్షుడు కట్ట నాగభూషణాచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ కు ఇచ్చిన హామీ మేరకు జూలై ఒకటి 2023 నాడు అమలులో ఉన్నా డి ఏ ను మాత్రమే విలీనం చేస్తూ నూతన పి ఆర్ సి ని ప్రకటించి జూలై 2023  నుండి వెంటనే అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ అమలుకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేయకుండానే ఈ నెల 31 వరకు పెన్షనర్స్ అందరూ నిర్ణీత ఫారంలో వివరాలను అందజేయాలని, పెన్షనర్లందర్నీ గందరగోళానికి గురి చేయకుండా తక్షణమే  మార్గదర్శకాలను విడుదల చేస్తూ ఈ హెచ్ ఎస్ ప్రీమియం ఒక శాతానికి మించకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వము తాను ఇచ్చిన హామీ మేరకు పెన్షనర్ల పెన్షనరీ బకాయిలు ఇతర పెండింగ్ బిల్లులు 10 0 రోజుల లోపు చెల్లించబడునట్లు  విధి విధానాలను ప్రకటించి తక్షణమే పెండింగ్ బిల్లులన్నింటినీ మంజూరు చేస్తూ పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని  రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టాప్రా  యూనిట్ అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి,టాప్రా నాయకులు బొంగోని వెంకటయ్య, తాటిపాముల కనకయ్య, దొంత హరికిషన్, గౌరీ శెట్టి సాంబయ్య, కంది రాజి రెడ్డి, తౌటం శ్రీహరి, మేకల మొగిలయ్య, తిరునగరి రమేష్, చాడ సమ్మిరెడ్డి, పరాంకుశం సనత్ కుమార్, నల్ల రాజిరెడ్డి, గాజర్ల బుచ్చిరాజం, గూడూరి స్వామి రెడ్డి, కే రమేష్ బాబు, బూర్ల లక్ష్మీనారాయణ,  పెదపాటి రమేష్, మంతెన సుదర్శన్, గాజే గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీ వ్యాపారులపై మెరుపుదాడులు

## వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసుల ఉక్కుపాదం
## అధిక వడ్డీలతో ప్రజలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు
## రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి గితే





వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా అనుమతులు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై మంగళవారం  పోలీసులు 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో మెరుపుదాడలు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో అక్రమ వడ్డీ వ్యాపారం,ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై 6 కేసులు నమోదు చేసి రూ. 1,39,65,000 విలువ గల వివిధ డాక్యుమెంట్లు, రూ. 1,77,000 విలువ గల బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించడం, అధిక వడ్డీలతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ....ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేసే వ్యాపారులపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమకున్న ఉన్న అత్యవసర పరిస్థితి,తాత్కాలిక అవసరాల కోసం అధిక మొతంలో అవసరాలకు మించి అధిక వడ్డీలకు అప్పు చేసి ఆతరువాత అప్పులు, అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్దతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చని, అలాగే స్థానిక పోలీసు వారికి పిర్యాదు చేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా జిల్లా ఎస్పీ  హెచ్చరించారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కలిసిన పెరిక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్



వాస్తవం : భద్రాచలం

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని రాష్ట్ర పెరిక కార్పొరేషన్ నూతన వైస్ చైర్మన్  బుడగం శ్రీనివాస్  సోమవారం ప్రగతి భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బుడగం శ్రీనివాస్ని కార్పొరేషన్ వైస్ చైర్మన్‌గా నియమితులైనందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క  అభినందించి, పుష్పగుచ్ఛం స్వీకరించారు. తనపై నమ్మకం ఉంచి కార్పొరేషన్ బాధ్యతలు అప్పగించినందుకు ఉప ముఖ్యమంత్రికి శ్రీ బుడగం శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పెరిక కులస్తుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# జిల్లాలో డ్రగ్స్,గంజాయి నిర్మూలనకు ప్రత్యేక తనిఖీలు



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలో కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ ప్రాంతాలలో నార్కోటిక్ జాగిలంతో తనిఖీలు నిర్వహణ. మత్తు పదార్థాల విక్రయాలు,రవాణాపై కఠిన చర్యలు తప్పవు. ఎల్లారెడ్డిపేట మండలంలోని కిరాణా, పాన్ షాప్స్,బస్టాండ్ పరిసర ప్రాంతాలలో డ్రగ్స్, గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు  మంగళవారం రోజు పోలీసు అధికారులు నార్కోటిక్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, బ్యాగులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. ప్రజల సహకారంతోనే మత్తు పదార్థాల నిర్మూలన,భద్రతా చర్యలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు

# సమ్మక్క సారక్క దేవాలయంలో బోరు



వాస్తవం : చెన్న ర్ ఆర్ సి

చెన్నూరు శాసనసభ్యులు రాష్ట్ర కార్మిక   మైనింగ్ శాఖ మంత్రి  డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి  పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ క్రిష్ణ ఆదేశాల మేరకు మా పెద్దలు కోటపల్లి మండల ఈ ఎక్స్ జెడ్పి టిసి. సభ్యులు పోటు చిన్న రాంరెడ్డి   చొరవతో మల్లంపేట గ్రామంలో సర్పంచ్ ఎలక్షన్లో ఇచ్చిన మాట ప్రకారం మల్లంపేట గ్రామం లోని సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద భక్తులకు నీటి కొరత ఉందని స్థానిక శాసన సభ్యులు,  మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి  దృష్టికి స్థానిక సర్పంచ్ తాళ్ళ వెంకటమ్మ ఒబాపు కోటపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాట్రాల మల్లయ్య  తీసుకువెళ్లిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం  మంగళవారం మల్లంపేట గ్రామంలో సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద బోరు వేపియడం జరిగింది.  ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్ళ వెంకటమ్మ బాపుఉప సర్పం చ్ వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొని బోరు దగ్గర  కొ బ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

# కిశోర బాలికలు ఉచిత సైక్లింగ్ శిక్షణను వినియోగించుకోవాలి

## తిరుమలగిరిలో శిక్షణ ను ప్రారంభించిన కలెక్టర్ తేజస్ నందనలాల్ పవార్



వాస్తవం : తిరుమలగిరి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' లో భాగంగా మహిళా సాధికారత కోసం మంగళవారం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో 'మహిళా శక్తి' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మండలంలో ని కిశోర బాలికలకు మహిళ సమాఖ్యల ద్వారా ఉచిత సైక్లింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత బాలికల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బాలికలకు క్రీడల పట్ల అవగాహన కల్పించడంతో పాటు, సైక్లింగ్ నేర్చుకోవాలనే ఆసక్తి, మక్కువ ఉన్న విద్యార్థినులను ప్రోత్సహించేందుకు ఈ సైకిళ్లను అందజేసినట్లు తెలిపారు. సైక్లింగ్ అనేది శారీరక దృఢత్వానికి మాత్రమే కాకుండా, బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా మహిళలు, బాలికలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం మహిళా సమాఖ్య ఏపీఎం లక్ష్మి మాట్లాడుతూ తిరుమలగిరి మండల మహిళ సమైక్య ఆధ్వర్యంలో అయిదు సైకిళ్లను కొనుగోలు చేసినట్టు తెలిపారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వి వో ఏ లు కిశోర బాలికలకు నేర్పిస్తారని తెలిపారు. ఇట్టి ఉచిత సైక్లింగ్ శిక్షణకు 18 సంవత్సరాల లోపు బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహసిల్దార్ హరి ప్రసాద్, ఎంపీడీవో లాజర్, ఏపిఎం లక్ష్మి సిసి నాగయ్య, ఎమ్మెస్ అధ్యక్షురాలు కవిత తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి కలెక్టర్



వాస్తవం : తిరుమలగిరి

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు తిరుమలగిరి మండలంలో ని ఈటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్‌ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై అధికారి శ్రీధర్ రెడ్డి, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, ఎస్సై గుత్త వెంకట్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ పాలేపు చంద్రశేఖర్, సిఈఓ కృష్ణారెడ్డి, రైస్ మిల్లర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి వృథా @ సిక్స్ డేస్



వాస్తవం : రాజేంద్రనగర్

త్రాగునీటి వృధాను అరికట్టడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. మైలార్దేవ్ పల్లి దుర్గా నగర్ చౌరస్తాలోని జలమండలి పంపింగ్ హౌస్ నుండి తాగునీరు రోడ్డు పాలు అవుతున్నా పట్టించుకునే నాధుడే లేకపోవడం సిగ్గుచేటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు రోజులుగా ఎన్ని లక్షల లీటర్ల నీరు రోడ్డు పాలు అయిందో అర్థం చేసుకోవచ్చు. తాగునీటిని వృధా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పే జలమండలి అధికారులకు ఈ దృశ్యాలు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చాలా ప్రాంతాలలో తాగునీటి కొరకు ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. చాలా తీవ్రంగా ఉన్న ఎండలతో తాగునీటి కటకట ప్రజలను ఆందోళన కలిగిస్తుంది. ఒకవైపు వేల రూపాయలు పెట్టి నీటి ట్యాంకర్ల ను కొంటున్న వైనం. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు పాలవుతున్న తాగునీరు. తాగునీటి వృధాపై ఈ నెల 21న అధికారుల వృధా ప్రజలకు వ్యధ అనే కథనం వాస్తవం దినపత్రికలో ప్రచురితమైన విషయం విధితమే.ఇదే అంశంపై మైలార్దేవపల్లి సెక్షన్, డివిజన్ 9 జలమండలి డీజీఎం మహేశ్వరరావును వివరణ కోరగా... టెక్నికల్ ఇష్యూ వల్ల మరమ్మతులలో జాప్యం జరుగుతుందని అన్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతు చేయాలంటే స్థానికంగా తాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం జరుగుతుందని చెప్పారు. అందువల్ల మరమ్మత్తు విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. 120 కిలోమీటర్ల నుండి తాగునీరు ఈ పంపింగ్ హౌస్ కి చేరుతుందని తెలిపారు. వృధాను అరికట్టడానికి సాయశక్తుల ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఒకటి రెండు రోజులలో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించి తాగునీటి వృధాను అరికడతామని వెల్లడించారు.

## అంగన్వాడి భవనాలను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేర బేగం గౌస్



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

మంగళవారం రోజునఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో సాయంత్రం 04:00 గంటలకు మన రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ప్రచువల్‌గా అంగన్వాడి భవనాలను ప్రారంభించాలని కోరగా ఇట్టి కార్యక్రమాన్నికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సాబేరా బేగం గౌస్ . రాచర్ల బొప్పాపూర్ లో రెండు అంగన్వాడీ కేంద్రాలను ప్రారంభించినారు.,ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బొప్పాపూర్ గ్రామంలో రెండు భవనాలకు కలిపి 24 లక్షలు మంజూరు చేసుకొని అంగన్వాడి కేంద్రాలను నిర్మించుకోగా ఈ రోజు ప్రారంభించుకోవడం చాలా సంతోషమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపినారు.ఈ కార్యక్రమంలో రాచర్ల బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి, ఐసిడిఎస్ వనిత , ఏఇ శ్రీనివాస్ , ఏఎంసీ డైరెక్టర్ కృష్ణ రెడ్డి, అంగన్వాడీ టీచర్లు, ఉపసర్పంచ్ కొండాపురం వెంకట్ రెడ్డి, రాచర్ల బొప్పాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు సల్ల పద్మ రెడ్డి, కొండాపురం శ్రీనివాస్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నందిమేడారం కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా ఆకారి రాజేశం నియామకం

వాస్తవం : ధర్మారం

ధర్మారం: నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టుకు లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా బొట్లవనపర్తి గ్రామానికి చెందిన న్యాయవాది ఆకారి రాజేశం నియమితులయ్యారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ సునీత కుంచాల నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవీకాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది.ప్రస్తుతం ఆకారి రాజేశం నందిమేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్నారు. ఆర్థిక స్థోమత లేని నిరుపేదలు, అట్టడుగు వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే ఈ నియామకం ప్రధాన ఉద్దేశమని కోర్టు వర్గాలు తెలిపాయి.అర్హులైన వారు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ద్వారా ఉచిత న్యాయ సలహాలు, సేవలు పొందవచ్చని పేర్కొన్నాయి. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని సూచించాయి.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత, నందిమేడారం అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొట్ల లక్ష్మీనర్సయ్యతో పాటు అసోసియేషన్ సీనియర్, జూనియర్ అడ్వకేట్లకు ఆకారి రాజేశం కృతజ్ఞతలు తెలిపారు.



# నిత్యం జామ్,ట్రాఫిక్ జామ్



**వాస్తవం : జూబ్లీహిల్స్**

ఐటీ సెక్టార్, హైటెక్ సిటీకి పోయే దారి,ప్రముఖ హాస్పిటల్ అపోలో కి పోయే దారి, ప్రముఖ స్టూడియో లు ఉన్న ప్రాంతానికి వెళ్ళే దారి అయిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీ కృష్ణ నగర్ మెయిన్ రోడ్ లో ప్రతిరోజూ సాయంత్రం నిత్యం ట్రాఫిక్ జామ్. ట్రాఫిక్ అధికారులు ఈ సమస్యను స్వయంగా చూసి సమస్యను పరిష్కరించాల్సిందిగా శ్రీ కృష్ణ నగర్ బస్తీ వాసులు కోరుతున్నారు.

# జీలుగు సాగుతో అధిక దిగుబడులు

## 50శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ

**వాస్తవం : చిగురుమామిడి**

వ్యవసాయ పొలంలో రైతులు జీలుగు విత్తనాలు సాగు చేస్తే పొలం సారవంతంగా మారి అధిక దిగుబడులు సాధించవచ్చని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు.మండలంలోని సుందరగిరి రైతు వేదికలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిలుగు విత్తనాలు పంపిణీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చి రొట్ట విత్తనాలు,జీలుగ విత్తనాలు అందిస్తుందన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమామిడి మండలానికి 330 క్వింటాల్ జీలుగ,50 క్వింటళ్లు జనము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.భూసారం పెంపునకు జీలుగ పంట చాలా బాగా పని చేస్తుందని,భూమిలోని పోషకాలను మొక్కలకు అందచేస్తుందని రైతులకు తెలిపారు.30కిలోల బస్తా 2.20 ఎకరాల్లో చల్లుకోవాలని,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుందరగిరి సర్పంచ్ జంగా శిరీష, ఉప సర్పంచ్ మెడబోయిన రాజు,ఏఈవో అంజలి,అఖిల,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధూ ఔట్.. ముఖ్యమంత్రి పదవికి రేపు రాజీనామా

**న్యూఢిల్లీ, మే 26 :** కర్ణాటకలో నాయకత్వ రగడ నాటకీయ మలుపు తీసుకున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం రాజీనామా చేయనున్నారు. బుధవారం బెంగళూరులో ఆయన విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజ్యసభ ద్వారా ఢిల్లీకి మకాం మార్చాలని సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించినట్లు తెలుస్తున్నది. జాతీయ స్థాయిలో ఆయనకు మరింత పెద్ద పాత్ర ఇస్తామని హామీ ఇచ్చింది. భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో మార్పులు తీసుకురావడం, పార్టీని, ప్రభుత్వాన్ని పునర్వ్యవస్థీకరించడం వంటి చర్యలు చేపట్టాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రికి తెలియచేసినట్లు తెలిసింది.అధికార బదిలీ సున్నితంగా, గౌరవప్రదంగా జరుగాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనపై సంపూర్ణంగా ఆలోచించడానికి పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రికి సమయం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో నాయకత్వ మార్పు కోరుకుంటున్నట్లు పార్టీ నాయకత్వం నుండి స్పష్టమైన సంకేతం వెలువడినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర పగ్గాలు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చాలా కాలంగా తెరవెనుక వేచి చూస్తున్నారు. ఢిల్లీలో మంగళవారం ఆరుగంటలకు పైగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం కర్ణాటకలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు బహిరంగంగా తోసిపుచ్చిన కొద్దిసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతేగాకుండా నేటి చర్చలు రాజ్యసభ, శాసనమండలి ఎన్నికలకు మాత్రమే పరిమితమయ్యాయని కూడా వారు స్పష్టం చేశారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి ఢిల్లీలో పెద్ద సంస్థాగత లేదా పరిపాలనా పాత్రను చేపట్టవచ్చని కాంగ్రెస్ నాయకత్వం సిద్ధరామయ్యకు తెలియచేసింది.మిగతా అన్ని విషయాలు, అన్ని సమస్యలు చూసుకుంటాం అని కూడా అధిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చిందని కూడా వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నాయకత్వ మార్పు అనివార్యమని పార్టీ వర్గాలు చెబుతుండగా కాంగ్రెస్ అధికారికంగా సిద్ధరామయ్య మార్పుపై ఎటువంటి చర్చ జరగలేదని ప్రకటించడం గమనార్హం. దాదాపు ఆరు గంటలకు పైగా జరిగిన చర్చల అనంతరం కేసీ వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ తమ చర్చలు రాజ్యసభ, కర్ణాటక శాసన మండలి ఎన్నికలకు మాత్రమే పరిమితమైనట్లు స్పష్టం చేశారు.

# అదరహో ఆర్సీబీ.. వరుసగా రెండోసారి ఫైనల్లోకి

**92 రన్స్ తేడాతో గుజరాత్‌పై ఘన విజయం**
**చెలరేగిన కెప్టెన్ పాటిదార్, బౌలర్లు**

**ధర్మశాల:** ఐపీఎల్‌లో వరుసగా రెండోసారి కప్పు నెగ్గేందుకు ఆర్సీబీ అడుగు దూరంలో నిలిచింది.మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో 92 రన్స్ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. ఈహై స్కోరింగ్ పోరులో తొలుత ఆర్సీబీ 20 ఓవర్లలో 254/5 స్కోరు చేసింది. పాటిదార్‌కు తోడు విరాట్ కోహ్లీ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), కృనాల్ పాండ్యా (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) రాణించారు. అనంతరం జీటీ 19.3 ఓవర్లలో 162 రన్స్‌కే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. రాహుల్ తెవాటియా (68),జోస్ బట్లర్ (29) టాప్ స్కోరర్లు. జాకబ్ డఫీ మూడు, రసిఖ్ దార్, భువీ, కృనాల్ రెండేసి వికెట్లతోదెబ్బ కొట్టారు. పాటిదార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లో ఓడిన గుజరాత్ ఫైనల్ చేరేందుకు మరో చాన్స్ ఉంది. బుధవారం సన్‌రైజర్స్-రాజస్థాన్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్‌లో నెగ్గే జట్టుతో శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో తలపడనుంది.బ్యాటర్లు విజృంభించిన పిచ్‌పై బౌలర్లూ సత్తా చాటడంతో ఆర్సీబీ విజయం తేలికైంది. భారీ ఛేదనలో గుజరాత్ ఆరంభంలోనే తడబడింది. ఫామ్‌లో ఉన్న టాప్-3 బ్యాటర్లను పవర్ ప్లేలోనే కోల్పోయిన జీటీ ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయింది. జాకబ్ డఫీ వేసిన మూడో ఓవర్లో ఓపెనర్ సుదర్శన్ (14)ను దురదృష్టం వెంటాడించింది. మూడో బంతిని పాయింట్ దిశగా ఆడిన తర్వాత అతని చేతుల్లోంచి బ్యాట్ జారిపోయి వికెట్ల మీద పడటంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. కొత్త బాల్‌తో అద్భుతంగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్.. కెప్టెన్ గిల్ (2)ను క్లీన్ బౌల్డ్ చేయడంతో జీటీ 27/2తో ఇబ్బందుల్లో పడింది.తన బౌలింగ్‌లో వరుసగా 4,6,4 కొట్టిన బట్లర్‌ను తర్వాతి బాల్‌కే లెగ్ కట్టర్‌తో ఔట్ చేసిన హేజిల్‌వుడ్ ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆరో ఓవర్లో నిశాంత్ సింధు (5)ను అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేసిన రసిఖ్ దార్ వెంటనే కోహ్లీ క్యాచ్‌తో జేసన్ హోల్డర్ (0)నూ పెవిలియన్ చేర్చడంతో జీటీ 51/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. సుందర్ (8), రషీద్ ఖాన్ (8) ను డఫీ ఔట్ చేయగా.. రబాడ (9) కూడా నిరాశపరచడంతో గుజరాత్ వందలోపే ఆలౌటయ్యే లా కనిపించింది. కానీ, ఓ ఎండ్‌లో సిరాజ్ (5)ను నిలబెట్టి పోరాడిన ఇంపాక్ట్ ప్లేయర్ రాహుల్ తెవాటియా అర్ధ శతకం పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు 150 దాటించి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.కెప్టెన్ రజత్ పాటిదార్ ముందుండి నడిపించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ టీమ్ ఆరంభం నుంచే పవర్ హిట్టింగ్‌తో అదరగొట్టింది. సిరాజ్ తొలి ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (19).. రబాడ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి వెంటనే ఔటయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన దేవదత్ పడిక్కల్ (30) తోడుగా కింగ్ కోహ్లీ జట్టుకు బలమైన పునాది వేశాడు. రబాడ బౌలింగ్‌లో కోహ్లీ 4,4,6 కొట్టడంతో పవర్‌ప్లేలోనే 76 రన్స్ వచ్చాయి. ఫీల్డింగ్ మారిన తర్వాత టైటాన్స్ బౌలింగ్ మెరుగైంది. పేసర్ హోల్డర్, స్పిన్నర్ రషీద్ వరుసగా నాలుగు ఓవర్లు కట్టడి చేశారు. ఈక్రమంలో రెండు బంతుల తేడాతో కోహ్లీ, పడిక్కల్‌ను ఔట్ చేసిన హోల్డర్ ఆర్సీబీ స్పీడుకు బ్రేకులు వేశాడు. దాంతో సగం ఓవర్లకు 99/3తో నిలిచిన ఆ జట్టు 200 చేసినా మంచి స్కోరే అనిపించింది. కానీ, సెకండాఫ్‌లో రజత్ పాటిదార్ షో మొదలైంది. కృనాల్ పాండ్యా తోడుగా అతను భారీ షాట్లతో విజృంభించాడు. హోల్డర్ బౌలింగ్‌లోనే సిక్స్‌తో స్కోరు వంద దాటించాడు. ప్రసిధ్ వేసిన 14వ ఓవర్లో రజత్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను వదిలేయడం గుజరాత్ పాలిట శాపంగా మారింది. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ఆర్సీబీ కెప్టెన్ మరింత రెచ్చిపోయాడు. కుల్వంత్ వేసిన 15వ ఓవర్లో కృనాల్ రెండు ఫోర్లు కొడితే.. పాటిదార్ 4,6,4 దంచడంతో 28 రన్స్ లభించాయి.అదే జోష్‌లో రషీద్ బౌలింగ్‌లో కృనాల్ ఓ సిక్స్, పాటిదార్ రెండు సిక్సర్లు రాబట్టారు. తర్వాతి ఓవర్లో కృనాల్‌ను హోల్డర్ ఔట్ చేసి 95 పరుగుల భాగస్వామ్యాన్ని ముగించినా రజత్ అస్సలు తగ్గలేదు. వరుసగా రెండు సిక్సర్లతో 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. టిమ్ డేవిడ్ (4) నిరాశ పరిచినా.. చివర్లో జితేశ్ (15 నాటౌట్) తోడుగా రజత్ మరింత జోరు పెంచాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో 6, 4.. ప్రసిధ్ వేసిన ఆఖరి ఓవర్లో మరో రెండు భారీ సిక్సర్లు కొట్టి స్కోరు 250 దాటించాడు. అతని ధాటికి ఆఖరి ఆరు ఓవర్లలోనే ఆర్సీబీ ఏకంగా 114 పరుగులు పిండుకోవడం గమనార్హం.








**వాస్తవం:హైదరాబాద్**

అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంటున్నాయిని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు.న్యూయార్క్ లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు. రీజనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారీ కోవల్ ఆధ్వర్యంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం నాడు డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించి బ్యారీ కోవల్. తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ లు అవగాహన పత్రాల (ఎంఓయు)ను మార్చుకున్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెజెనరాన్‌కు ఐర్లాండ్, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నజిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని తెలిపారు.. ఇది ప్రపంచ వ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి అత్యున్నత స్థాయి డిజిటల్ సేవలను అందిస్తుందని చెప్పారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పనిచేస్తుండగా, మరిన్ని అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. జిసిసి ల కేంద్రంగా ముంబయి, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో ఉన్న బలమైన ఎకోసిస్టం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోందన్నారు.తెలంగాణ ప్రభుత్వం పరిశోధన, తయారీ రంగం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. జీనోమ్ వ్యాలీ విస్తరణ, త్వరలో ఏర్పాటు కానున్న గ్రీన్ ఫార్మా సిటీ వంటివి రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు.రెజెనరాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ద్వారా రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రపం చంలో ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థల్లో ఒకటైన రెజెనెరాన్ ఇప్పటికే అనేక ఔషధా లను అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రెజెనెరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారి కోవాల్, రెజెనెరాన్ జీసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఓనాట్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సంపూర్ణ అక్షరాస్యతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

## జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు




వాస్తవం : అందోల్

సంపూర్ణ అక్షరాస్యత నే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమనిజోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ అన్నారు. జోగిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీ, బీఎల్ఓలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం'లో భాగంగా అందోల్--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించి రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత వైపు నడిపించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని 15 నిండిన ప్రతి నిరక్షరాస్యుడిని గుర్తించి చదవడం, రాయడం లెక్కలు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉల్లాస్ అనేది కేవలం ఒక పథకం కాదని, సామాజిక ఉద్యమమని, ఆర్పీలు, బీఎల్ఓలు ప్రతి వార్డులో నిరక్షరాస్యులను గుర్తించాలని ఈ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ మౌనిక, స్వరూప, కోఆర్డినేటర్ బిక్షపతితో పాటు ఏఎల్ఎఫ్, ఆర్పీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ బోధన



వాస్తవం : మోత్కూర్

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధన ఉంటుందని మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న అన్నారు.మంగళవారం మోత్కూరు ఉన్నత పాఠశాల లో జరిగిన బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అత్యుత్తమ విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బెటి శైలజ కౌన్సిలర్లు కుర్మేళ ప్రమీల పన్నాల శ్రీ విద్య శ్రీనివాస్ రెడ్డి, అల్లాడి సోమేశ్వర్ మరియు ఉపాధ్యాయులు టి.అంజయ్య ,ఇ.రాంప్రసాద్ సుధీర్ కుమార్ డి మంజుల ఏ.వెంకటాచారి,జె.ప్రవీణ్ డి.స్వప్న,జె.రవికుమార్ , ఆర్.వెంకటాచారి ,మర్రి జయశ్రీ టి. ఉప్పలయ్య ఎం వెంకటేశ్వర్లు ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఐకెపి ఈఓలకు పూర్తి మద్దతు ప్రకటించిన తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం

## జిల్లా అధ్యక్షులు మిరియాల శ్రీనివాస్



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెర్ప్ డిపార్ట్మెంట్ కార్యాలయం వద్ద మంగళవారం ఐకెపి వివోలు నిరవధిక సమ్మె కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డిపేట రాజన్న సిరిసిల్ల జిల్లా జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షులు మిరియాల శ్రీనివాస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐకెపి వివోలు గత 18 సంవత్సరాలుగా గ్రామీణ మహిళల అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఎనలేని సేవలు చేస్తున్నప్పటికీ వారికి తగిన గౌరవం, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.ప్రభుత్వ పథకాల అమలులో వివోలను విస్తృతంగా వినియోగించుకుంటున్నప్పటికీ, వారి సంక్షేమంపై గత ప్రభుత్వం గానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ సరైన దృష్టి పెట్టలేదన్నారు. ఐకెపి ఉద్యోగులు సేవలలో ఉండగానే మరణిస్తే కారుణ్య నియామకాలు లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో కారుణ్య నియామకాలు అమలు చేస్తున్నప్పటికీ, ఐకెపి ఉద్యోగుల విషయంలో అలాంటి సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు.వివోలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య భీమా, నెట్వర్క్ సౌకర్యాలు, అవసరమైన వనరులు కూడా సరైన స్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు పెద్దపీట వేస్తున్నామని చెప్పే ప్రభుత్వం, గ్రౌండ్ స్థాయిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు.18 సంవత్సరాలు సేవలందించిన ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం పడే బాధను ప్రభుత్వం గుర్తించాలని , అలాంటి కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. వివోల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి =వఝుత్ష్ట్ర =వ.ం.ఎ పెద్ద మనసుతో స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జేఏసీ సెర్ప్ అధ్యక్షురాలు కొప్పుల రమ, ఉపాధ్యక్షురాలు దోమటి రేణుక, కార్యదర్శి సాయిని నీలిమ, కోశాధికారి ఆడెపు శోభారాణి, సహాయక కోశాధికారి తాడికొండ లావణ్యతో పాటు ఎల్లారెడ్డిపేట మండల ఐకెపి వివోలు పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మిరియాల శ్రీనివాస్ తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

# భూపాలపల్లిలో ఘనంగా 108 పైలట్ డే వేడుకలు



వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో పైలట్ డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్వో డాక్టర్ మధుసూదన్ హాజరై కేక్ కట్ చేసిన అనంతరం 108 అంబులెన్స్ పైలట్ల సేవలను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ ముందుగా ప్రతి పైలట్ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, అదే సమయంలో ప్రజలకు అంకితభావంతో సేవలు కొనసాగించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందిస్తూ అనేక ప్రాణాలను కాపాడుతున్న 108 పైలట్ల సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లా మేనేజర్ రాజు నాయక్ మాట్లాడుతూ ఎండాకాలం, వర్షాకాలం, చలికాలం అనే తేడా లేకుండా పగలు రాత్రి నిరంతరం 108 పైలట్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. మారుమూల గ్రామాలు, క్లిష్టమైన రహదారులు అయినప్పటికీ రోగులను సురక్షితంగా ఆసుపత్రులకు తరలిస్తూ ప్రాణ రక్షణలో కీలక పాత్ర పోషించడంలో ముఖ్య పాత్ర పైలట్ లదే అన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఈఎమ్ఈ రాజు నాయక్, జిల్లాలోని 108 పైలట్లు పాల్గొని పైలట్ డే వేడుకని ఘనంగా నిర్వహించారు.

# దత్తప్పగూడెం గ్రామంలో వరి గడ్డి దహనం నివారణపై రైతులకు అవగాహన



వాస్తవం : మోత్కూర్

యాదాద్రి భువనగిరి జిల్లా, మోత్కూర్ మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో వరి గడ్డి దహనం వల్ల ఏర్పడే పర్యావరణ కాలుష్యం, నేల సార నష్టం మరియు ఆరోగ్య సమస్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి. కీర్తి , వ్యవసాయ విస్తరణ అధికారి ఆర్. సింహ ప్రసాద్ పాల్గొని రైతులకు వరి గడ్డి కాల్చడం వల్ల కలిగే న ష్టాలను వివరించారు.రైతు నేస్తం కార్యక్రమంలో రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులు వరి గడ్డిని కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అను సరించాలని సూచించిన విషయాన్ని అధికారులు ఈ సం దర్భంగా ప్రస్తావించారు.అధికారులు మాట్లాడుతూ వరి గడ్డి దహనం చేయడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు నేలలోని సేంద్రియ పదార్థాలు, సూక్ష్మజీవులు నశించి భూ మి సారవంతత తగ్గుతుందని తెలిపారు. అలాగే పర్యావర ణానికి మరియు ప్రజల ఆరోగ్యానికి హానికర ప్రభావాలు క లుగుతాయని వివరించారు.వరి అవశేషాలను నేలలో కల పడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ తయారీ వంటి పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రైతు గంగని రమేష్ తదితరులు స హకరించి గ్రామ స్థాయిలో వరి గడ్డి దహనాన్ని నివారించేం దుకు ముందుకు వచ్చారు. పర్యావరణ పరిరక్షణలో రైతులు భాగస్వాములు కావాలని అధికారులు కోరారు.